# రైతులూ.. జర జాగ్రత్త !



విత్తనాలు, ఎరువుల విక్రయ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి (ఫైల్)

జహీరాబాద్, మే 25 : వానకాలం (ఖరీఫ్) సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు విత్తనాలు ఎంపికలో జాగ్రత్తలు తప్పని సరిగా పాటించాలి. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. విత్తనాల ప్యాకెట్లపై ఆకర్షణీయమైన ఫొటోలు, తక్కువ ధరలు ఆఫర్లు చూసి మోసపోవద్దు. ఈ సీజన్‌లో పత్తి, కంది, సోయాబీన్, పెసర, మినుము తదితర పంటల సాగుపైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయశాఖ ద్వారా రాయితీ విత్తనాలు వస్తున్నప్పటికీ కొంతమంది రైతులు ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలను కొనేందుకు సిద్ధమవుతున్నారు. పలు విత్తన కంపెనీలు డీలర్లకు ఆఫర్లు ప్రకటిస్తాయి. ఆ ఆఫర్ల కోసం డీలర్లు విత్తనాలను తక్కువ ధరతో ఎక్కువ దిగుబడి వస్తుందని దుకాణా నిర్వాహకులు నమ్మిస్తూ అంటగడతుంటారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. అసలు ఏదో, నకిలీ ఏదో గుర్తించేలేని విధంగా మార్కెట్‌లోకి వస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రైవేటు పరంగా విడుదలయ్యేవి ఉంటాయి. ప్రభుత్వ పరంగా రూపొందించిన రకాలను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు రూపొందించిన విత్తనాలను నోటిఫైడ్ పేరిట మార్కెట్‌లోకి వస్తాయి. నోటిఫైడ్ విత్తనాల నాణ్యత, పంపిణీ ప్రమాణాలకు అనుగుణంగా లేపోతే ఉత్పత్తిదారులపై, పంపిణీదారులపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చు. వానకాలం సాగుకు రైతులు పొలాలను దుక్కి దున్నుతున్నారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే తమ పొలాల్లో విత్తనాలను విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోళ్లకు రైతులు నిమగ్నమయ్యారు. విత్తనాల కొనుగోళ్ల సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తే మంచిదని, నాణ్యమైన, ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీలకు చెందిన వాటిని కొనుగోళ్లు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికే ఉగాది, అక్షయ తృతీయ పర్వదినాల సందర్భంగా కొంత మంది రైతులు విత్తనాలు కొనుగోలు చేసి దాచుకున్నారు. మరికొద్ది రోజుల్లో మృగశిరకార్తె ఆరంభం కానున్నది. ఈ నేపథ్యంలో వానకాలం సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోళ్లలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

**విత్తనాలు కొనుగోలులో...**

వానకాలం (ఖరీఫ్) సాగుకు విత్తనాలు కొనుగోళ్లు చేసే ముందు రైతులు వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన అధికృత డీలర్ నుంచి విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు సమయంలో బిల్లులో విత్తన రకం నంబర్, గడువు తేదీ, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం బిల్లులో ఉండేలా చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాలు, గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయొద్దు. బిల్లులో విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మకపు నంబర్, విత్తనాలు ప్యాకెట్, డబ్బా, సంచిలపై సీలు ఉందా లేదా నిర్ధారించుకోవాలి, విక్రయదారుడు ఇచ్చే కర పత్రాలను తీసుకొని వాటిలో పేర్కొన్న అంశాలను సరిచూసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా దాచి పెట్టుకోవాలి, విత్తనాలు సాగు చేసిన అనంతరం మొలకెత్తే దశలో, పూత దశలో లోపాలు కనిపిస్తే వ్యవసాయాధికారులను సంప్రదించాలి

**ఎరువుల కొనుగోలులో..**

లైసెన్సు ఉన్న డీలర్ వద్దనే ఎరువులను కొనుగోలు చేయాలి. బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రతగా దాచి పెట్టుకోవాలి. ఎరువుల సంచులు మిషన్ కుట్టుతో ఉన్న వాటిని కొనుగోలు చేయాలి. చేతితో కట్టిన వాటిని కొనుగోలు చేయరాదు, ఎరువుల ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ పేరు, ఉత్పత్తి దారుడి పేరు ఉందా లేదా తప్పని సరిగా చూసుకోవాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం వస్తే ఎరువులను వ్యవసాయాధికారులకు చూపించి పరీక్షకు పంపాలి. అన్య పదార్థాలు కనిపిస్తే ఆ ఎరువులను కల్తీలుగా గుర్తించాలి.

**క్రిమిసంహారక మందుల కొనుగోలులో..**

పంటలు సాగు చేసిన అనంతరం ఆశించే చీడపీడల నివారించే క్రిమిసంహారక మందుల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయ, ఉద్యానవన, శాస్త్రవేత్తలు సూచించిన మందులను మాత్రమే కొనుగోలు చేయాలి. అవసరానికి మించి మందులు కొనుగోలు చేయరాదు, పురుగు మందుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగుల మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి, అత్యంత విష పూరితమైతే నీలం రంగు, స్వల్ప విష పూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తు లు ఉంటాయి. పంటకు ఆశించిన చీడ పురుగుల నివారించేందుకు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలను ఖాళీ అయిన తర్వాత ధ్వంసం చేయాలి, లేదా గుంతలో పూడ్చి వేయాలి.

- విత్తనాలు, ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి
- తక్కువ ధరలు, ఆఫర్లు నమ్మొద్దు
- నాణ్యమైనవి ఎంపిక చేసుకుంటే మేలు
- వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలి

### జాగ్రత్తలు పాటించాలి..



విత్తనాలు, ఎరువులు, మందులపై రైతులు అవగాహన ఉండాలి. ముఖ్యంగా అనుమతి ఉన్న దుకాణాల్లోనే వీటిని కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వాటికి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, సంస్థ పేరు లేబుల్, పరిమాణ విత్తనం ధర, అమ్మిన వారి సంతకం వంటి వివరాలు తప్పనిసరిగా ఉండాలి. విత్తన, ఎరువు, మందు బస్తా, డబ్బాలపై ముద్రించిన ధ్రువపత్రం బిల్లు పంట చేతికి వచ్చే వరకు రైతులు భద్రపరుచుకోవాలి. సంచులు, డబ్బాలపై ఉత్పత్తి, విక్రయదారుడి పేరు, చిరునామా లాట్ నెంబర్ పరీక్షించుకోవాలి. విత్తనాలు, ఎరువులను కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. విత్తన, ఎరువుల సంచులను రైతులు నమూనా వివరాల కోసం కోతకు వచ్చే వరకు దాచుకోవాలి. ఏమైనా సమస్యలుంటే వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులకు తప్పకుండా రైతులు సంప్రదించాలి.

-భిక్షపతి, ఏడీఏ జహీరాబాద్

## డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలి



నల్లవల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, మే 25 : ప్యారానగర్ డంపింగ్ యార్డు వద్దే వద్దని రైతు జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పేరానగర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయబోయే డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారానికి 11వ రోజు చేరుకున్నాయి. ఇందులో రైతు జేఏసీ నాయకులు. మహిళా సంఘాల సభ్యు లు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు



వావిలాల పీర్లా చెరువు సమీపంలోని మూల మలుపు వద్ద ధ్వంసమైన రోడ్డు

జిన్నారం, మే 25 : నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మించిన సీసీ రోడ్లు వేసిన కొద్ది కాలానికే ధ్వంసమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జినానరం మండలం వావిలాల గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి పీర్లా చెరువు కట్ట వరకు నిర్మించిన సీసీ రోడ్డు మూల మలుపు వద్ద పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు వాపోతున్నారు. లక్షలతో నిర్మించిన రోడ్డు ధ్వం సం కావడంపై విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి గుండానే వాహనదారులు ఇటు గడ్డపోతారం, అటు జంగంపేట, జిన్నారం గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగిస్తారని చెబుతున్నారు. కొన్ని నెలల కిందటే వేసిన రోడ్డు సైతం శిథిలం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్డును తక్షణమే బాగుచేయాలని వావిలాల గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

## భూములకు మార్కెట్ ధర చెల్లించాలి



గుమ్మడిదలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, మే 25 : మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 109లో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ము ల గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని సీజీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు రైతులతో కలిసి సమావేశంలో మాట్లాడారు. రైతులను ప్రభుత్వం గుర్తించి పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మండల అవసరాల నిమిత్తం పాఠశాలలు, కళాశాలలు, ప్ర భుత్వ కార్యాలయాల కోసం 50 ఎకరాల స్థలాన్ని ప్రత్యేకంగా కేటాయించాలని సూ చించారు. రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానంద రెడ్డి, బాలకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, వాసుదేవ రెడ్డి, బండాల భాస్కర్, సూర్యనారాయణ, చం ద్రారెడ్డి, ఆంజనేయులు యాదవ్, కుంటి మల్లేశ్, పుర్రోళ్ల మల్లేశ్, రవీందర్, కుంటి పెంటయ్య, బొల్లవోయిన శేఖర్, ఉషన్న రాజు రైతులు పాల్గొన్నారు.


## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

జహీరాబాద్, మే 25 : 2008-09 బ్యాచ్ న్యాల్‌కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థులు జహీరాబాద్ పట్టణంలోని సిద్ధి ఇంటర్నేషనల్ హోటల్‌లోని కన్వేషన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గురువులకు ఘనంగా సన్మానించారు.

## హజ్‌యాత్రకు వెళ్తున్న రైల్వే బోర్డు సభ్యుడికి సన్మానం



షేక్ ఫరీద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మే 25 : హజ్‌యాత్రకు వెళ్తున్న బీఆర్ఎస్ పట్టణ నాయకుడు, రైల్వే బోర్డు సభ్యుడు షేక్ ఫరీద్‌కు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు మోహిద్దీన్, ముర్తుజా, తదితరులు పాల్గొన్నారు.

## తిరంగా ర్యాలీతో త్రివిధ దళాలకు సంఘీభావం



జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

జిన్నారం, మే 25 : ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా బొల్లారం మున్సిపాలిటీలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, స్థానిక సీఐ రవీందర్ రెడ్డిలతో కలిసి అఖిలపక్ష నాయకులు జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ మున్సిపల్ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు హనుమంత్ రెడ్డి, గుండ్ల మహేందర్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ఆనంద్ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ఎస్సై దశరథ్, స్థానికులు పాల్గొన్నారు.

## నల్లవాగు ప్రాజెక్టు కట్టపై కంకర తేలిన రోడ్డు



నల్లవాగు బండ్‌పై తేలిన కంకర

సిర్గాపూర్, మే 25 :నల్లవాగు మధ్యతర హాప్రాజెక్టు బండ్‌పై రోడ్డు కంకర తేలి అధ్వాన్నంగా మారింది. గుంతలు సైతం పడి వెళ్లరాని దుస్థితి ఏర్పడింది. ప్రాజెక్టు కట్ట పొడవు మొత్త 1.6 కిలో మీటరు దూరం ఉంది. గత దశాబ్దం కితం బీటీ రిన్యువల్ చేశారు. ప్రస్తుతం రోడ్డు దీనస్థితికి చేరుకోవడంతో రైతులు, స్థానికులు, సిబ్బంది నిత్యం అత్యవసర పనులపై వెళ్లేందుకు తిప్పలు పడుతున్నారు. బైకుపై వెళ్లాలంటే చుక్కలు కనిపిస్తాయని స్థానికులు అంటున్నారు. ప్రాజెక్టు బండ్‌పై బీటీ రోడ్డు మరమ్మతులు లేదా, రీబీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు విషయమై సంబంధిత ప్రాజెక్టు ఏఈఈ అలైఖ్య రెడ్డిని విచారించగా, రోడ్డు అభివృద్ధికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరవ్వగానే పనులు చేయిస్తామని ఆమె తెలిపారు.

## విత్తనాల కొనుగోలులో జాగ్రత్త వహించాలి

సిర్గాపూర్, మే 25 : వానకాలం సమీపిస్తున్నందున మార్కెట్‌లో రైతులు విత్తనాలు కొనేముందు జాగ్రత్త వహించాలని మండల వ్యవసాయాధికారి హరికృష్ణ రైతులకు సూచించారు. గ్రామాల్లో లైసెన్స్ డీలర్ వద్ద నుంచే విత్తనాలు విక్రయించాలన్నారు. తెలియని డీలర్ల వద్ద విత్తనాలు తీసుకోవద్దన్నారు. స్థానిక పరిస్థితులకు అనుకూలమైన, మంచి దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను మా త్రమే కొనుగోలు చేసి వారి వద్ద నుంచి తీసుకున్న బిల్లుపై సంతకాలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా రైతుల వద్ద డబ్బులు అడ్వాన్స్‌గా తీసుకొని విత్తనాలు విక్రయిస్తే మా త్రం వెంటనే సంబంధిత ఏఈవోకు తెలియజేయాలని సూచించారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు అమ్మితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు.



## హ్యాపీ జర్నీ..

అమెరికాలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ,రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు మునిపల్లి మండలం బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో నిశంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద కలిసి హ్యాపీ జర్నీ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రాహుల్ కిరణ్, వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రజినీకాంత్, మునిపల్లి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, నాయకులు బండారి పాండు, నజీర్ పటేల్, శేఖర్, శివ కుమార్ ఉన్నారు.

-మునిపల్లి, మే 25

## రాయికోడ్,హస్నాబాద్ గ్రామాల్లో ఈజీఎస్ బృందం పర్యటన



హస్నాబాద్ లో గ్రామస్తులతో కేంద్ర బృందం సభ్యులు

రాయికోడ్, మే 25 : మండల పరిధిలోని రాయికోడ్, హస్నాబాద్ గ్రామాల్లో ఆదివారం ఉపాధిహామీ పథకం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని సీసీ రోడ్లు, నర్సరీలు, పల్లెప్రకృతి వనం, మెటల్‌రోడ్లు,క్రీడా మైదానాలను పరిశీలించారు. వారి వెంట సెంట్రల్ గవర్నమెంట్ అధికారి పంకజ్ కుమార్ రాణా, డీఆర్‌డీవో జ్యోతి, డీఆర్‌డీవో ఏపీడీ బాల్‌రాజు, పీఆర్ డిప్యూటీ ఈఈ కుర్మయ్య, ఏఈ దేవయ్య, ఎంపీడీవో షరీఫ్, ఎంపీవో అంజాలిదేవి, మండల ఉపాధిహామీ సిబ్బంది నాయకులు కేదారినాథ్ పాటిల్, నాగారం విఠల్ ఉన్నారు.

## పోచమ్మ ఆలయంలో పూజలు



తక్కడపల్లిలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న సాయికుమార్

మునిపల్లి,మే 25 : మండలంలోని తక్కడపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు సాయికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవాటు చేసుకోవాలని సూచించారు.

# సమీపిస్తున్న వానకాలం సీజన్

- పంట పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు రైతుల పరుగులు
- ఎరువులు, విత్తనాలు కొనుగోలుకు అప్పులు
- పూర్తిస్థాయిలో అందని రైతుభరోసా డబ్బు లు
- మాఫీ కానీ పంట రుణాలు.. కొత్త రుణాలు ఇవ్వని బ్యాంకులు
- వానలు రాకతో రైతులు సన్నద్ధం
- వేధిస్తున్న జీలుగ, జనుము విత్తనాల కొరత



వాన కాలం పంట విత్తనాలు వేసేందుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు

పటాన్‌చెరు, మే 25: మరో వారం రోజుల్లో వానకాలం సీజన్ ప్రారంభం కానున్నది. వానకాలం సీజన్‌కు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు అందించడంలో ప్రభుత్వం సిద్ధం కానున్నట్లు పరిస్థితులను చూస్తుంటే తెలుస్తున్నది. జీలుగ విత్తనాల పంపిణీ ఈ పాటికే పూర్తిచేయాల్సి ఉండేది. జిల్లాలో శనివారం పలుచోట్ల జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభించారు. కానీ, చాలాచోట్ల రైతులకు తొలిరోజే విత్తనాలు సరిపోలేదు. ప్రభుత్వం రైతులకు పంటపెట్టుబడి సాయం అందించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. యాసంగి రైతు భరోసా డబ్బులు ఇంకా చాలామంది రైతులకు రాలేదు. ఇప్పుడు వానకాలం రైతు భరోసా వచ్చే పరిస్థితి లేదు. దీంతో రైతులు వానకాలం సాగు పనులకు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంటసాగు కోసం ఎకరానికి రూ.10 వేలు రైతుల బ్యాంకు ఖాతాలో సీజన్‌కు ముందే జమ చేసింది. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన రైతుబంధు ఎరువులు, విత్తనాలు కొనుగోలుతో పాటు విత్తనాలు వేసేందుకు కూలీలకు, దుక్కి దున్నేందుకు ట్రాక్టరు ఖర్చులకు ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలు పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయలేదు. పటాన్‌చెరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో రైతులు విత్తనాలు వేసేందుకు రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. ఎకరా భూమి దుక్కి చేసేందుకు ట్రాక్టరుకు రూ. 1200 వరకు అద్దె తీసుకుంటున్నారు. వ్యవసాయ పనులు చేసేందుకు గ్రామాల్లో ఎడ్లు లేకపోవడంతో రైతులు ట్రాక్టరుతో దుక్కులు సిద్ధం చేస్తున్నారు. డీజిల్ ధరలు పెరిగిపోవడంతో వ్యవసాయ యంత్రాల అద్దెలు పెంచారు. మా ర్కెట్‌లో విత్తనాల ధరలు పెరిగిపోయాయి. మే చివరి వారంలో భారీ వర్షాలు కురిస్తే రైతులు నల్లరేగడి భూముల్లో పత్తి విత్తనాలు వేస్తారు. వాన కాలంలో రైతులు ఎక్కువగా పత్తి, వరి, పెసరి, మినుము, జొన్న, సోయా, కందితో పాటు పలు పంటలు సాగు చేస్తారు. పత్తి, వరి విత్తనాలు ఎక్కువగా రైతులు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తారు. విత్తనాలు ధరలు ప్రతి ఏడాది పెరిగిపోవడంతో రైతులకు భారంగా మారింది. ఎకరం భూమిలో పంటలు సాగు చేసేందుకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రైతులు రూ. 30 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తున్నది. వానకాలం పెట్టుబడులకు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద రూ. 3 నుంచి రూ.5 వరకు అప్పు తెచ్చుకుంటున్నారు.

**రుణాలు ఇవ్వని బ్యాంకులు**

రైతులు పంటలు సాగు చేసేందుకు గతంలో తీసుకున్న అప్పులు చెల్లించలేదు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంటరుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రకటించింది. దీంతో రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు రైతులు చెల్లించలేదు. సర్కార్ రైతుల పంట రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయకపోవడంతో వాన కాలం సీజన్‌లో కొత్త పంట రుణాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పంటలు సాగు చేసేందుకు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకునే పరిస్థితి ఏర్పడింది. పంట రుణాలు రెన్యువల్ చేసుకోనేందుకు వడ్డీ చెల్లించే పరిస్థితి రైతులకు లేకుండా పోయింది. ప్రభుత్వం గతేడాది రైతులకు రైతు భరోసా డబ్బులు వేసినా బ్యాంకులు వడ్డీ కోసం తీసుకున్నాయి. సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు అంత ఆసక్తి చూపడం లేదు. దీంతో పంటలు సాగు చేసేందుకు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

### పటాన్‌చెరు నియోజకవర్గంలో వాన కాలం పంట సాగు అంచనా..

పటాన్‌చెరు నియోజకవర్గంలో వరి 5074 ఎకరాలు, పత్తి 2081 ఎకరాలు, మొక్కజొన్న 295 ఎకరాలు, జొన్న 28, కంది 96 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచన వేశారు. రామచంద్రపురం మండలంలో వరి 774 ఎకరాలు, పత్తి 214 , మొక్కజొన్న 31, జొన్న 30, కంది 88 ఎకరాలు, అమీన్‌పూర్ మండలంలో 420 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారని అంచన వేశారు. గుమ్మడిదల మండలంలోని వరి 5300 ఎకరాలు, పత్తి 750, మొక్కజొన్న 300, కంది 302 ఎకరాలు, జిన్నారం మండలంలో వరి 5800 ఎకరాలు, పత్తి 3025 ఎకరాలు, సాగు చేస్తారని అంచన వేశారు. పటాన్‌చెరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్‌లో వరి 17368 ఎకరాలు, పత్తి 30 25 ఎకరాలు, మొక్కజొన్న 626 ఎకరాలు, జొన్న 85, కంది 476 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో వానకాలంలో సుమారు 21, 555 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసేందుకు దుక్కులు సిద్ధం చేసినట్లు అంచన వేసి విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నారు.

## పరామర్శ..



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

జిన్నారం, మే 25 : జిన్నారం మండలం మంగంపేట మాజీ ఉపసర్పంచ్ నక్క నాగరాజు మాతృమూర్తి లక్ష్మీబాయి, పెద్దమ్మ గూడెం గ్రామానికి చెందిన నాయకులు సీత అరవింద్ తాత కొమరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆదివారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్, స్థానిక నాయకులు షిమ్మారెడ్డి, బండి శ్రీకాంత్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, ఖదీర్, నరేందర్, మోహన్, రవి, లక్ష్మణ్, శ్రీకాంత్, గ్రామస్తులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

సిర్గాపూర్, మే 25 : నల్లవాగు సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులకు ఉపాధి కల్పన లక్ష్యంగా నైపుణ్యతా అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక ప్రిన్సిపాల్ తిరుపతయ్య ఆదివారం తెలిపారు. ఈ విషయంపై గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరీ వర్షిణి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు ఉచితంగా నైపుణ్యతపై శిక్షణనిచ్చి లబ్ధి చేకూరుస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు ఈనెల 26వ తేదీ వరకు తమ పేర్లను స్థానిక గురుకులంలో నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలను నల్లవాగు గురుకులం ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

## 27న భవిష్య నిధి సమస్యల పరిష్కారం

పటాన్‌చెరు రూరల్, మే 25 : 27న భవిష్య నిధి సంస్థ ద్వారా లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి ఆఫ్‌కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆదివారం ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. భవిష్య నిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాతో పాటు హైదరాబాద్‌లోనూ సమస్యల పరిష్కార శిబిరాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

## గుంతలు పూడ్చిన యువకులు



పోతిరెడ్డిపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చిన యువకులు

కోహీర్, మే 25 : మండలంలోని పోతిరెడ్డిపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలను యువకులు ఆదివారం పూడ్చి వేశారు. పోతిరెడ్డిపల్లి ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చాలా రోజుల నుంచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో యువకులు నడుం భిగించారు. కంకర, ఇసుక తీసుకువచ్చి గుంతలను పూడ్చారు. దీంతో ఆ మార్గం గుండా కోహీర్, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు వెళ్లే వాహనదారుల ఇబ్బందులు తొలిగిపోయాయి. వాహనదారుల ఇబ్బందులను తీర్చినందుకు యువకులను స్థానికులు అభినందించారు.

## నేడు పుల్కల్‌లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

పుల్కల్, మే 25 : నేడు మండల కేంద్రం పుల్కల్ రైతు వేదికలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా కేతకీలో కోటి జప యజ్ఞం

ఝరాసంగం, మే 25 : మండల కేంద్రమైన ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర ఆలయంలో ఆదివారం కోటి జప యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో దేశ రక్షణ-ధర్మ శిక్షణ సంకల్పంతో విశ్వ మానవ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శివ మంత్ర జప యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ యజ్ఞంలో పలువురు భక్త దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహరాజ్, ధనశ్రీ పీఠాధిపతి వీరేశ్వర శివచార్య, రంజోల్ రాజయోగ పీఠాధిపతి రాచయ్య స్వామి, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆలయ ఈవో శివరుద్రప్ప, ఆలయ మాజీ చైర్మన్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.